క్లుప్తంగా

ఆస్తిపన్నులో రాయితీ

కొల్లాపూర్: పెండింగ్‌లోని ఆస్తిపన్ను బకాయిలను ఈ నెల 30లోపు చెల్లించే వారికి 5 శాతం రాయితీ సౌకర్యం కల్పించినట్లు మున్సిపల్ కమిషనర్ రాజయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆస్తిపన్నులు, నల్లా బిల్లులు సకాలంలో చెల్లించాలని కోరారు. రాయితీ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలోని ప్రజలు ముందస్తు ఆస్తిపన్ను చెల్లిస్తే వారికి రిబేట్ సౌకర్యాన్ని అందిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ నెల 30లోపుగా చెల్లిస్తే వారికి రిబేట్ అందుతుందన్నారు.

అభ్యంతరాల స్వీకరణ



కల్వకుర్తి టౌన్: పట్టణంలోని 99వ సర్వే నంబర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు గాను దరఖాస్తులు చేసుకున్న వారు ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రత్యేకంగా కేటాయించిన ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు, కాలనీవాసులతో సమావేశాలను ఆయా వార్డుల ప్రత్యేకాధికారులు నిర్వహించారు. అందుకు సంబంధించిన జాబితాను కేంద్రాల్లో ప్రదర్శించి, అర్హులు, అనర్హులు ఏవైనా అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా సోమవారం స్వీకరించారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు, వార్డుల ప్రత్యేకాధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

నేటి నుంచి హనుమాన్ జయంతి ఉత్సవాలు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలియజేశారు. ప్రతి సంవత్సరం ఆలయంలో మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారని, నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయని చెప్పారు. 4న గణపతి పూజ, 108 కలశ పూజ, రుద్ర హోమం నిర్వహించనున్నారు. 5న శ్రీలక్ష్మి హరహర రుద్రహోమం, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి రుద్రాభిషేకం, రాత్రికి కల్యాణోత్సవం ఉంటుందన్నారు.

6న శోభాయాత్ర

హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 6న ప్రసన్నాంజనేయ స్వామికి పంచామృతాభిషేకం శ్రీలక్ష్మీ హరహర రుద్రహోమం, పూర్ణాహుతి నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి శోభాయాత్ర పట్టణ పురవీధుల వెంట నిర్వహించనున్నారు. మూడు రోజుల నుంచి ఆలయంలో హనుమత్ జ్ఞాన యజ్ఞ సమితి ఆధ్వర్యంలో భజనలు, హనుమాన్ చాలీసా పారాయణం, గీతాపారాయణం నిర్వహించనున్నారు. కార్యక్రమాలను నిజామాబాద్ సచ్చిదానంద స్వామీజీ, నర్వికలానంద స్వామీజీ, కృపానంద స్వామీజీల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలియజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు హాజరుకావాలని కోరారు.

సయ్యద్ అక్బానీసా ఉర్సు

నాగర్‌కర్నూల్ రూరల్: మండల పరిధిలోని పెద్దాపూర్‌లో హజ్రత్ సయ్యద్ అక్బానీసా సాహెబ్ ఉర్సు మంగళవారం ప్రారంభమవుతుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉర్సు ఉత్సవ కమిటీ సభ్యులు సయ్యద్ జమాల్ పాష, సయ్యద్ పాష సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మంగళవారం రాత్రి గంధోత్సవం నిర్వహిస్తారని తెలియజేశారు.

సీపీఐ నియోజకవర్గ స్థాయి సమావేశం

కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని కేఎల్ఐ అతిథి గృహంలో మంగళవారం సీపీఐ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ కార్యదర్శి యూసుఫ్ వెల్లడించారు. సమావేశానికి పార్టీ రాష్ట్ర నాయకులు బాల్‌నర్సింహ, ఫయాజ్ హాజరవుతారని తెలిపారు. పార్టీ శాఖ కార్యదర్శులు, మండల నాయకులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఉపాధి పనుల పరిశీలన

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పెండింగ్‌లోని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ గంగమోహన్ కోరారు. సోమవారం మండలంలోని అల్లాపూర్, యంగంపల్లి, గుట్టలపల్లి, ఆకునెల్లికుదురు గ్రామాలను సందర్శించారు. ఉపాధి పనులు, నర్సరీలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీఓ లక్ష్మణ్‌నాయక్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ఉన్నారు.



‘పది’ పరీక్ష మొదటి రోజు ప్రశాంతం



వెల్దండలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్

అచ్చంపేట రూరల్: మొదటి రోజు పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని మండల విద్యాధికారి రామారావు తెలిపారు. అచ్చంపేట మండలంలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో 1,286 మంది విద్యార్థులకు గానూ మొదటి రోజు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. ఒకరు ఇన్‌డయాన్ విద్యార్థి కాగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఇద్దరు గైర్హాజరయ్యారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద అన్ని భద్రత ఏర్పాట్లు చేశామని, పోలీసులు 144 సెక్షన్ విధించారని చెప్పారు. అదేవిధంగా మండలంలోని పలు పరీక్ష కేంద్రాలను నాగర్‌కర్నూల్ డీఈఓ గోవిందరాజులు తనిఖీ చేశారు.

ఇద్దరు గైర్హాజరు

కొల్లాపూర్: పట్టణంలోని నాలుగు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. సోమవారం పరీక్షలకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఆర్డీఓ హనుమనాయక్, తహసీల్దార్ రమేష్‌నాయక్, ఎంఈఓ చంద్రుడు తనిఖీ చేశారు.

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని 9 కేంద్రాల్లో కలిపి 1,784 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 1,781 మంది హాజరయ్యారు. ముగ్గురు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు.

వెల్దండ: పరీక్ష కేంద్రాల వద్ద ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 144 సెక్షన్ విధించారు. మోడల్ హైస్కూల్ 230 మంది విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 160 మంది విద్యార్థులు పరీక్షలకు పూర్తిస్థాయిలో హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను పరీక్షల విభాగం జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి, వెల్దండ తహసీల్దార్ చంద్రశేఖర్ వేర్వేరుగా పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఎలాంటి కాపీయింగ్ పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని పరీక్ష నిర్వాహకులు పర్వతాలు, అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డిలకు సూచించారు.

ఉప్పునుంతల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల స్థాయి పదో తరగతి పరీక్ష కేంద్రంలో సోమవారం మొదటి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. ఉపాధ్యాయులు విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపించారు. మండలంలోని నాలుగు జెడ్పీహెచ్ఎస్‌లు, ఒక కేజీబీవీ పాఠశాలకు చెందిన మొత్తం 168 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ అర్జునయ్య, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ శ్రీధర్‌రావు వివరించారు.

కేకేరెడ్డిలో ఒకరు

తెలకపల్లి: మండల పరిధిలోని గౌరెడ్డిపల్లి పాఠశాలలో 193 మంది, తెలకపల్లిలో 163 మంది, తెలకపల్లిలో 220 మంది, కేకేరెడ్డి పాఠశాలలో 185 మంది విద్యార్థులకు గాను 184 మంది హాజరై ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు కేకేరెడ్డి పాఠశాలలోని పరీక్షల కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు తెలియజేశారు. మొదటి రోజు 10వ తరగతి పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో 520 మంది విద్యార్థులకు అందరూ హాజరైనట్లు తెలిపారు. మూడు కేంద్రాలను పరిశీలించారు.

జటప్రోల్‌లో మరొకరు..

పెంట్లవెల్లి: మండల కేంద్రం సెంటర్‌లో 98 మంది, జటప్రోల్‌లో 84 మందికి 83 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని స్క్వాడ్ చంద్రుడు, తహసీల్దార్ దామోదర్ పరీక్ష కేంద్రం తనిఖీ చేశారు. ఎండాకాలంలో ఎండలు విపరీతంగా ఉండటంతో విద్యార్థులకు నీటి సదుపాయం, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆయా సెంటర్ల ఇన్‌చార్జ్‌లకు తెలియజేశారు.

చారకొండ: మండలంలో వంద శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎగ్జామినర్ అంజయ్య తెలియజేశారు. పరీక్ష కేంద్రాన్ని ఎస్ఎస్సీ జెయింట్ డైరెక్టర్ నర్సమ్మ తనిఖీ చేసి పరిశీలించారు.

మన్ననూర్: మొదటి రోజు విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో తెలుగు పరీక్ష రాశారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, పీటీజీ, గిరిజన ఉన్నత పాఠశాల, ఆశ్రమ పాఠశాల, కేజీబీవీ పాఠశాలలకు చెందిన మొత్తం 301 మంది విద్యార్థులకు గానూ 292 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 9 మంది గైర్హాజరైనట్లు తెలియజేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించేందుకు గానూ ఫ్లెయింగ్ స్క్వాడ్ శ్రీనివాసులు కేంద్రంలోని ఆయా పరీక్ష హాల్‌లు తిరిగి విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలించారు. కార్యక్రమంలో సీఎస్ నాగయ్య, పురుషోత్తం పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లి: తిమ్మాజీపేట, బిజినేపల్లి మండలాల్లో పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉపాధ్యాయులు విద్యార్థులను గేటు వద్దనే తనిఖీ చేశారు.

కోడేరు: మండలంలో మొత్తం 329 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా.. 327 మంది హాజరయ్యారు. మిగతా ఇద్దరు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణయ్య, కుర్మయ్య తెలిపారు.

లింగాల: మండల కేంద్రంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 258 మంది విద్యార్థులకు అందరు హాజరైనట్లు పరీక్షల నిర్వాహకులు చెన్నయ్య, శంకర్ తెలిపారు.



జిల్లాకేంద్రంలో నంబర్ చూసుకుంటున్న విద్యార్థి



పెంట్లవెల్లిలో ..



చారకొండలో..

యువతకు స్ఫూర్తి కొమురయ్య



గంగారంలో శివాజీ, కొమురయ్యల జయంతి వేడుకలు

కల్వకుర్తి రూరల్: భూమి కోసం భుక్తి కోసం, విముక్తి కోసం పోరాడిన అమరుడు కొమురయ్య యువతకు స్ఫూర్తి అని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు, జిల్లెల సర్పంచ్ జంగయ్య అన్నారు. సోమవారం కొమరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడారు. నిజాం నిరంకుశ వైఖరిని నిరసిస్తూ తెలంగాణ తల్లి విముక్తి కోసం నిరంతరం పోరాడిన మహనీయుడని కొనియాడారు. పెద్దయ్య యాదవ్, శోభాశేఖర్‌రెడ్డి, ఆంజనేయులు, పాండుగౌడ్, భగవంతు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లి: మండలంలోని గంగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఛత్రపతి శివాజీ, కొమురయ్య జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహావీరుల చిత్రపటాలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలు వేసి నివాళి అర్పించారు. రాజారాం ప్రకాష్, సురేష్ పాల్గొన్నారు.

కొల్లాపూర్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దొడ్డి కొమురయ్య జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ మల్లేశం, వైస్ ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్ పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. నిజాం పాలన నుంచి తెలంగాణ విముక్తి కోసం పోరాడిన వీరుడు కొమురయ్య అన్నారు. భూస్వాములు, పెత్తందారులకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. అధ్యాపకులు స్వర్ణలత, ఉదయ్ కుమార్, రమేష్‌కుమార్, వెంకటయ్య, కురుమయ్య, స్వామిసాగర్, శివుడు, కవిత, వసుంధర తదితరులున్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



కొల్లాపూర్‌లో మాట్లాడుతున్న సీడీపీఓ

కొల్లాపూర్: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటరమణ అన్నారు. సోమవారం కొల్లాపూర్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో పోషణ పక్షం ప్రోగ్రాం నిర్వహించారు. చిరుధాన్యాలు తీసుకోవడంతో కలిగే ప్రయోజనాలను సీడీపీఓతో పాటు ఎంపీడీఓ చెన్నమ్మలు వివరించారు. చిరుధాన్యాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కేజీబీవీ విద్యార్థులు బహుమతి గెలుచుకున్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు స్వాతి, శోభారాణి, రత్నమాల, భాగ్యలక్ష్మి, జయలలిత పాల్గొన్నారు.

వాడకం ఎంతో అవసరం

బల్మూర్: మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే చిరుధాన్యాల వాడకం ఎంతో అవసరమని ఎంపీపీ అరుణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మండల స్థాయి పోషణ పక్షం సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని, రక్తహీనత పోవాలంటే పోషకాహారం తీసుకోవడం ముఖ్యమన్నారు. వైస్ ఎంపీపీ నారాయణ, ఎంపీడీఓ దేవన్న, తహసీల్దార్ క్రిష్ణానాయక్, శివశంకర్, అమృత, భారతి పాల్గొన్నారు.

రక్తహీనత దూరం

కల్వకుర్తి టౌన్: పాఠశాలలో చదువుతున్న కిశోర బాలికల్లో రక్తహీనతను తగ్గించేందుకు చిరుధాన్యాలు చాలా ఉపయోగపడుతాయని కల్వకుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వెంకటమ్మ అన్నారు. సోమవారం పట్టణంలోని మోడల్ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులకు రక్తహీనత సమస్యను ఎలా అధిగమించాలనే విషయమై అంగన్‌వాడీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి అంగన్‌వాడీ సిబ్బంది ప్రతిజ్ఞ చేయించారు.



కల్వకుర్తిలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఆలయ అభివృద్ధికి విరాళం

వెల్దండ: మండల పరిధిలోని పెద్దాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మగుడి అభివృద్ధికి సోమవారం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.2 లక్షల విరాళం అందజేశారు. ఈసందర్భంగా ఎగ్జిక్యూటివ్ సభ్యులు వరప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేవాలయ అభివృద్ధికి సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. యాదగిరి, జయంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుఖజీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

మన్ననూర్: గుండెపోటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్ సోమవారం పరామర్శించారు. అమ్రాబాద్ మండలం జంగంరెడ్డిపల్లికి చెందిన జంగిరెడ్డి గుండెపోటుకు గురికావడంతో హైదరాబాద్‌కు తరలించి సిమ్స్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అధైర్యపడవద్దని మనోధైర్యం కల్పించారు.

కేసు నమోదు

బల్మూర్: మండలంలోని అంబగిరికి చెందిన వివాహితను అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు కొంత కాలంగా వేధింపులకు గురిచేస్తుండగా.. బాధితురాలి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందంగౌడ్ తెలిపారు. అంబగిరికి చెందిన విజయ్ మూడు నెలల నుంచి వివాహితను పలు రకాలుగా వేధింపులకు పాల్పడుతూ వస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదులో తెలిపిందని ఎస్ఐ తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వెల్దండ: మండల పరిధిలోని బైరాపూర్ వాగు నుంచి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సోమవారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా బైరాపూర్ వాగు నుంచి పెద్దాపూర్ 2 ట్రాక్టర్లు, గుండాలకు 1 ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్నారు. పక్కా సమాచారంతో సిబ్బంది ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్ల యాజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్థిక సాయం అందజేత

వెల్దండ: మండల పరిధిలోని తుంకిబండతండాకు చెందిన ఐశ్వర్య రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అనంతరం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి సహకారంతో రూ.5 వేలు అందజేశారు. సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు తదితరులు ఉన్నారు.

కోడేరు: మండలంలోని తుర్కదిన్నెకి చెందిన అక్తర్ బేగం అనారోగ్యంతో మృతిచెందడంతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, ఊశన్న పరామర్శించి బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. రాములు, పుట్ట శివయ్య, సత్యనారాయణ, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల బీమా చెక్కు

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లిలో విద్యుదాఘాతంతో మృతిచెందిన రంజిత్‌రావు కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ద్వారా మంజూరైన రూ.2 లక్షలు బీమా చెక్కును సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మృతుని భార్య అశ్వినికి అందజేశారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి రూ.2 లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందని ఎమ్మెల్యే తెలియజేశారు.



ఆత్మీయ సమ్మేళనాలు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న వెంకటగిరి

లింగాల: మండల కేంద్రంలో ఈ నెల 5న నిర్వహించనున్న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని సింగిల్‌విండో వైస్ చైర్మన్ వెంకటగిరి పార్టీ కార్యకర్తలను కోరారు. సోమవారం గ్రామపంచాయతీ ఆవరణలో ఆత్మీయ సమ్మేళనంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. సమ్మేళనంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు పాల్గొంటారని చెప్పారు. మండలంలో పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి సూచనలు, సలహాలు తీసుకోవడమే గాక మున్ముందు మండలంలో బలమైన శక్తిగా బీఆర్ఎస్‌ను తయారు చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించడం జరుగుతుందన్నారు. సమ్మేళనంలో మండలంలోని ప్రతి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సర్పంచ్ కోనేటి తిర్పతయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యలు పట్టవా?



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ స్కాం పాలకులకు పట్టదా అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకుడు ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ ప్రశ్నించారు. సోమవారం బీసీ సంక్షేమ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇతర ప్రాంతాల్లో సభలు, సమావేశాలు నిర్వహించడానికి సమయం పాలకులకు ఉంటుంది కానీ నిరుద్యోగుల గురించి పట్టించుకునే తీరిక లేదని విమర్శించారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని, పేద బిడ్డలకు రావాల్సిన ఉద్యోగాలను వారికి అనుకూలమైన వారికి రూ.కోట్లల్లో పేపర్ అమ్ముకుని కొల్లగొట్టడానికి ప్రయత్నించారని ఆరోపించారు. ఈ విషయంలో నిరుద్యోగులకు తగున్యాయం చేయకుంటే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కుంభం మల్లేశ్‌గౌడ్, కొత్త శ్రీను, పబ్బతి శ్రీనివాసులు, తిరు

‘ప్రజావాణి’ని సద్వినియోగం చేసుకోండి



లింగాల: సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారి, మండల ప్రత్యేకాధికారి కృష్ణ కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో డీపీఓ పాల్గొని మాట్లాడారు. సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మండలంలోని అన్ని శాఖల మండల స్థాయి అధికారులు ప్రజావాణికి తప్పక హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, డీటీ ముబినాబేగం, ఏఓ నాగార్జునరెడ్డి, ఏపీఎం బాలస్వామి, ఎంపీఓ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


పెద్దకొత్తపల్లి: స్థానిక బస్టాండ్ కూడలిలో ఫ్రెండ్స్ హెయిర్ స్టైయిల్ యజమాని జంపుల నిరంజన్ ప్రజల దాహం తీర్చేందుకు సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రజలంతా వేసవిలో చలివేంద్రం ద్వారా దాహం తీర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో కుర్మయ్య, భాస్కర్‌రెడ్డి, భరత్, వెంకటరమణ, చక్రధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ నాలా స్థలాన్ని కాపాడాలని వినతి



నాగర్‌కర్నూల్ రూరల్: పట్టణ కేంద్రం హౌసింగ్ బోర్డు కాలనీలో ప్రభుత్వ నాలా స్థలాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీ అధ్యక్షుడు పృథ్వీరాజ్ మాట్లాడారు. రూ.4 కోట్ల విలువైన ప్రభుత్వ నాలా స్థలాన్ని కొంత మంది అక్రమార్కులు ఆక్రమించుకుని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఆ స్థలంలో మొదట వినాయక చవితి ఉత్సవాలు జరిపి అనంతరం కబ్జా చేసి బిల్డింగ్ నిర్మించేందుకు చూస్తున్నారని ఆరోపించారు. ఆ స్థలాన్ని కాపాడాలని వారు వినతి సమర్పించారు. బీఎస్పీ అసెంబ్లీ నాయకులు మహేశ్ యాదవ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

పీఎస్‌బీ వినియోగంతో పెట్టుబడి ఆదా



బిజినేపల్లి: వరి సాగు చేసిన పొల్లాలో భాస్వరాన్ని కరిగించేందుకు పీఎస్‌బీ పొలంలో చల్లుకోవడంతో మొక్కలకు భాస్వరం అందుతుందని ఏఈఓ ఫరీద్ పాష సూచించారు. సోమవారం మండలంలోని గంగారం కేతరబండతండాలో రైతులు సాగు చేసిన వరి పొలంలో పీఎస్‌బీ కలిపి చల్లిన క్షేత్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పీఎస్‌బీ కలిపి చల్లుకోవడంతో డీఏపీ కోసం ఖర్చు చేయాల్సిన రూ.2,500 పెట్టుబడి రైతులకు ఆదా అవుతుందన్నారు.

విద్యార్థులకు సన్మానం

ఉప్పునుంతల: మండలంలోని తాడూరుకు చెందిన జంపుల ఇందిర బాలరాజ్ కుమారుడు దినేష్ మెడిసిన్ సీటు సాధించినందున అతడిని సోమవారం మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ శాలువాతో సన్మానించి అభినందించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన ఎండీ జహంగీర్ కుమారుడు ఎండీ ఫయాజ్ ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన స్మాష్ రాకెట్ పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో అతడిని మాజీ ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, శేఖర్‌గౌడ్, తిర్పతయ్య, ఎల్లయ్య, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



కొల్లాపూర్: మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య పనులను చేపట్టాలని కోరుతూ బీఎస్పీ నాయకులు సోమవారం ఆర్డీఓ హనుమనాయక్, తహసీల్దార్ రమేష్‌నాయక్‌కు వినతి అందించారు. మున్సిపాలిటీలోని రాజాబంగ్లా పరిసరాలు, అంబేద్కర్ చౌరస్తాతో పాటు పలుచోట్ల చెత్త, చెదారం పేరుకుపోతోందన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. బీఎస్పీ మండల అధ్యక్షుడు పోతుగంటి బాలకృష్ణుడు, జిల్లా నాయకులు కారంగి బ్రహ్మయ్య, దాసు, శివరాం, శివ తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యంగా ఐక్యతా సేవలు



కల్వకుర్తి రూరల్: నియోజకవర్గంలోని ప్రజలు, యువకులకు విద్యా, వైద్యం, ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఐక్యతా ఫౌండేషన్ చేయూతనిస్తుందని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మరాసిపల్లిలో ఆయన సోమవారం పర్యటించారు. గ్రామంలోని పాఠశాల అభివృద్ధికి సహకారం అందించడంతో పాటు దేవాలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో పురాతన దేవాలయాల అభివృద్ధితో పాటు పాఠశాలల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రాఘవేందర్‌రెడ్డికి స్వాగతం పలికారు. కౌన్సిలర్ రవీందర్, పర్వత్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, జంగయ్య, పానుగంటి జంగయ్య, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీపంలో పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త రామకృష్ణ చలివేంద్రాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. గతేడాది మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఆయన ఈ ఏడాది ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సామాజిక సేవ అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

మన్ననూర్: నిరుద్యోగులు, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ.. ప్రశ్నపత్రాల లీకేజీలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తక్షణమే బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేస్తూ.. శ్రీశైలం –హైదరాబాద్ ప్రధాన రహదారిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సోమవారం పదో తరగతి తెలుగు పేపర్ తాండూర్‌లో లీక్ కావడంతో పాటూ యూ ట్యూబ్‌లో దర్శనం ఇవ్వడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలోని ఏ ఒక్క వ్యవస్థకు పటిష్టత లేకపోవడం విచారకరమన్నారు. లీకేజీలకు పాల్పడుతున్న అక్రమార్కులు ఎవరో కారని అధికార పార్టీకి చెందిన నాయకుల కనుసన్నల్లోనే ఈ వ్యవహారాలు నడుస్తున్నాయని ఎంపీటీసీ రహీం, నాయకులు వెంకటరమణ, వెంకటేశ్వర్లు, శివాజీ తదితరులు విమర్శించారు.

సమవేశానికి తరలిన విశ్వబ్రాహ్మణులు

తాడూరు: జిల్లా కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల నుంచి సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మనుమయ సంఘ సమావేశానికి విశ్వబ్రాహ్మణులు తరలివెళ్లారు. సమావేశంలో విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి అభివృద్ధి, ఎలా ముందు సాగాలి వివిధ అంశాలకు సంబంధించిన విషయాలు సమావేశంలో చర్చించనున్నట్లు విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ప్రకాశ్ చారి, సురేందర్, లక్ష్మణాచారి తెలియజేశారు.